క్లుప్తంగా

ప్యాచ్‌వర్క్స్ ప్రారంభం



చెప్పల్‌బజార్‌లో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో శుక్రవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పిలిపించిన కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ మరమ్మతులు చేయించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, బీజేపీ నేతలు ప్రతిభ, శ్యామ్, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలి

ముషీరాబాద్: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఆగస్టు 15 నుంచి ధర్నాచౌక్ వద్ద 4వ రోజు సమ్మె కొనసాగించారు.

థియేటర్‌లో ఫ్యాన్స్ మధ్య గొడవ

చిక్కడపల్లి: హీరో ప్రభాస్ ఫ్యాన్స్ మధ్య గొడవ ముదిరి తీవ్ర స్థాయికి చేరింది. ప్రభాస్ నటించిన యోగి సినిమాను ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో శుక్రవారం విడుదల చేశారు. మ్యాట్నీ షో సందర్భంగా కొందరు అల్లరి చేయడంతో పాటు ఓ వర్గం వారు స్క్రీన్ వద్దకు వెళ్లబోయారు. మరో వర్గం అడ్డుకోవడంతో వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ క్రమంలో వారిని థియేటర్ సిబ్బంది మరో గేటు నుంచి బయటకు పంపారు. బయటికి వచ్చిన వారు కూల్‌డ్రింక్స్ సీసాలను పగులగొట్టడంతో గొడవ ముదిరినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం

నల్లకుంట: ఎంఎస్సీ ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసేందుకు నగరానికి వచ్చిన ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా దిండికి చెందిన భీముడు వ్యవసాయదారుడు. కాగా ఆయన కుమార్తె ముధావత్ సంధ్యారాణి (22) హైదరాబాద్ నల్లకుంటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతూ.. స్థానికంగా ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల స్వగ్రామం వెళ్లిన ఆమె ఈనెల 17న పరీక్ష ఉండటంతో 16న సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చింది. 17న సాయంత్రం తండ్రి కుమార్తెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. పలు చోట్ల విచారించినప్పటికీ కుమార్తె ఆచూకీ లభించలేదు. దీంతో అతడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం.. జామై ఉస్మానియా – ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి (65) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన తెలుపు రంగు పూర్తి చేతుల చెక్స్ చొక్కా, గోధుమ రంగు ఫ్యాంట్ ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి.. చికిత్స పొందుతూ మృతి

పరారీలో నిందితుడు

అంబర్‌పేట: కట్నం కోసం భార్యను చితకబాదగా.. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అంబర్‌పేట ఖాద్రిబాగ్‌కు చెందిన గౌసియాబేగం (32)కు మూసారాంబాగ్‌కు చెందిన ఇమ్రాన్‌తో దాదాపు 7 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం. ఇమ్రాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వివాహమైనప్పటి నుంచే భార్యను అదనపు కట్నం కోసం వేధించేవాడని, దీంతో ఆమె కుటుంబసభ్యులు వారిని ఖాద్రిబాగ్‌లోకి మకాం మార్చారు. ఎలాంటి మార్పు రాకపోగా కట్నపు వేధింపులు కొనసాగుతూ వచ్చాయని సమాచారం. ఈ క్రమంలో ఈ నెల 10న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఆగ్రహించిన ఇమ్రాన్ భార్య కడుపు, తల ఇతర శరీర భాగాలపై తీవ్రంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. తిరిగి ఈ నెల 15న గౌసియాబేగం తీవ్ర అస్వస్థతకు గురికాగా.. ఆమెను గాంధీ ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

స్టీల్ బ్రిడ్జికి నాయిని పేరు

నాయిని సేవలకు లభించిన గౌరవం ● నియోజకవర్గంలో సర్వత్రా హర్షం



ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.450 కోట్లతో ఇందిరాపార్కు నుంచి వీఎస్‌టీ వరకు 2.62 మీటర్ల పొడవున దక్షిణాదిలోనే తొలి సారిగా నిర్మించిన స్టీల్‌బ్రిడ్జికి ఉక్కు మనిషిగా పేరున్న రాష్ట్ర తొలి హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి పేరు పెట్టడంపై నియోజకవర్గ ప్రజల్లో సర్వత్ర హర్షం వ్యక్తమవుతోంది. నాయిని నర్సింహ్మారెడ్డి తొలిసారిగా 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనతా దళ్ పార్టీ తరఫున పోటీ చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక శాఖమంత్రులను ఒక కార్మిక నాయకుడు ఓడించడం అప్పట్లో సంచలనంగా మారింది. అప్పటి నుంచి 2022లో మరణించేంత వరకు దాదాపు 40 ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిస్తూ.. వస్తున్నారు. నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ తొలి హోంశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర సాధన కోసం తొలి దశ ఉద్యమం, మలిదళ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి పాలుపంచుకున్నారు. తెలంగాణ కోసం తన మంత్రి పదవికి సైతం రాజీనామా చేశారు. ఆయన సేవకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్మించిన ఈ స్టీల్ బ్రిడ్జికి నాయిని నర్సింహ్మారెడ్డి పేరు పెట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్ బ్రిడ్జి ముషీరాబాద్ నియోజకవర్గానికే ఐకాన్‌గా మారుతుందని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాయిని సేవలకు గుర్తింపు



1978 నుంచి 2022 వరకు సుమారు 40 ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు నాయిని నర్సింహ్మారెడ్డి చేసిన సేవలకు లభించిన గౌరవం ఇది. కార్మిక నాయకుడు, ప్రజా నాయకుడిగా నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆయన పేరును స్టీల్ బ్రిడ్జికి పెట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నేత

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



ఆర్టీసీక్రాస్ రోడ్స్, వీఎస్‌టీ జంక్షన్, ఇందిరాపార్కు జంక్షన్‌లలో నిత్యం రద్దీగా ఉంటూ.. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. స్టీల్ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. విద్యానగర్, నల్లకుంట, రామాంతపూర్, డీడీ కాలనీ, తార్నాక తదితర ప్రాంతాల వారు నగరంలోకి వెళ్లాలంటే ఈ మార్గం ఎంతో సులువుగా ఉంటుంది.

– ఎమ్మెల్యే ముఠా గోపాల్

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు



ముషీరాబాద్ నుంచి మూడుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రిగా పనిచేసి ఉక్కుమనిషిగా పేరున్న నాయిని నర్సింహ్మారెడ్డి పేరును స్టీల్‌బ్రిడ్జికి పెట్టడం గర్వకారణం. సీఎం కేసీఆర్, కేటీఆర్‌లకు నాయిని కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. స్టీల్ బ్రిడ్జికి నాయిని పేరుతో ఆయన పేరు చిరస్మరణీయంగ ఉంటుంది.

– వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయిని అల్లుడు

అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రమేష్‌రాం, కార్పొరేటర్లు

ముషీరాబాద్: నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రమేష్‌రామ్ మాట్లాడుతూ.. దళితబంధు కోసం దరఖాస్తు చేసుకున్న దళితులకు దళితబంధు చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. అర్హులైన బీసీలందరికీ బీసీబంధు మంజూరు చేయాలన్నారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను వివాహమై ఆరు నెలలు గడుస్తున్నా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆసరా పెన్షన్‌ల కోసం 57 ఏళ్ల నుంచి 65 ఏళ్లున్న వృద్ధుల దరఖాస్తులు స్వీకరించినప్పటికీ వారికి పెన్షన్ మంజూరు చేయడం లేదన్నారు. అర్హులైన వికలాంగులు, వృద్ధులు, వితంతులకు కొత్త పెన్షన్‌లు మంజూరు చేయాలని గత రెండేళ్లుగా నూతనంగా ఎవరికీ పెన్షన్‌లు మంజూరు చేయడం లేదని విమర్శించారు. తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకాన్ని దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు రచనశ్రీ, సుప్రియనవీన్‌గౌడ్, కె.రవిచారి, రాష్ట్ర నాయకులు భరత్‌గౌడ్, పార్థసారధి, వెంకటేష్, పరిమళ్‌కుమార్, రంగరాజుగౌడ్, వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు మహేందర్‌బాబు, సాయిచంద్, రవికుమార్, నరేష్, అరుణ్‌కుమార్, రామిరెడ్డి, నవీన్‌గౌడ్, నందు, ఉమేష్, గడ్డం నవీన్, శేష సాయి, పద్మజారెడ్డి, ప్రఫుల్ రామిరెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులు సామాజిక స్పృహను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ముషీరాబాద్: పేద, ధనిక తేడా లేకుండా దేశంలోని ప్రతీ విద్యార్థికి సమానమైన విద్యా విధానం అమలు చేయాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని ఇది దేశానికి ప్రమాదకరమన్నారు. దేశంలోని విశ్వవిద్యాలయాల్లో కనీస సౌకర్యాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, ఎస్.వీ.శ్రీకాంత్, శ్యామ్, నాగేశ్వర్, కిరణ్, తిరుపతి, చరణ్, మస్తాన్, వేణు, శ్రీనివాస్ తదితరులున్నారు.

కేంద్రమంత్రికి అభినందన



కాచిగూడ: కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలో ఉంటేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. బర్కత్‌పుర హౌజింగ్‌బోర్డు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.శరత్ శ్యామ్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని బర్కత్‌పురలోని మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలబోకే అందజేసి అభినందనలు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాలనీ వాసులందరూ.. బీజేపీకి మద్దతుగా నిలిచి రాష్ట్రంలో బీజేపీ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు. రచనారెడ్డి, వివేక్‌ఆనంద్, పాడిశెట్టి కిషోర్, కరణ్‌సింగ్ హజారి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు అన్ని విధాలా సహకరిస్తాం

చిక్కడపల్లి: పారిశుద్ధ్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని వారికి అన్ని విధాలా సహకరిస్తామని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ స్ట్రీట్ నంబర్ 4లో చెత్తను సేకరించేందుకు నూతన రిక్షాను కార్పొరేటర్ చేతులమీదుగా జీహెచ్‌ఎంసీ సిబ్బందికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. చెత్తను ప్రజలు బయట పారవేయకుండా చెత్తరిక్షాల వారికే ఇవ్వాలన్నారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, గాంధీనగర్ ఓనర్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శామ్యూల్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏ.కే.వాసుదేవచారి, కార్యదర్శి గోపాల్, కోశాధికారి సుబ్బారావు, సలహాదారు, సీవీ గోపాలకృష్ణమూర్తి, బీజేవైఎం నవీన్‌కుమార్, సాయి సంతోష్, ఆనంద్‌రావు, ఎస్‌ఎఫ్‌ఏలు సోమేష్, రాజ్‌కుమారి పాల్గొన్నారు.

'కార్మిక పక్షపాతి సీఎం కేసీఆర్ '

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మిక, ఉద్యోగ పక్షపాతి సీఎం కేసీఆర్ అని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ పి.నారాయణ అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి ఉద్యోగభద్రత కల్పిస్తూ వేతనాలను పెంచుతూ.. కార్మికులకు అన్ని రకాలుగా రక్షణ కల్పిస్తున్నారన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాటర్‌బోర్డు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం సదస్సుకు నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాటర్ బోర్డులో పనిచేసే 4 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీవో 60 ద్వారా వేతనాలు పెంచడమే కాకుండా వారందరికీ ఉద్యోగ భద్రత కల్పిస్తూ.. పీఆర్‌సీలో భాగస్వామ్యం కల్పించామన్నారు. యూనియన్ జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారత్నం, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, బాలరాజు, ఆంజనేయులు, యాదగిరి, వాసు, నాగార్జున, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

కాచిగూడ: కోట్లాది భక్తుల ఆరాధ్య దైవంగా కొలుస్తూ కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు తిరుమలలో మరిన్ని వసతులు, కాలినడకన వస్తున్న భక్తులకు సేవల పునరుద్ధరణ చేపట్టాలని భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు ఏపీ ప్రభుత్వం, ఆలయ పాలకమండలికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ దేవాలయంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీపతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

'ప్రభుత్వ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం'



అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాల అమలు చేయడంలో వైఫల్యం చెందుతుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతంరావు విమర్శించారు. శుక్రవారం అంబర్‌పేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీసీబంధు, దళితబంధు, మైనార్టీ బంధు వంటి పథకాలు ఆర్భాటపు ప్రకటనలే తప్పా.. క్షేత్ర స్థాయిలో అర్హులకు అందడం లేదని గౌతంరావు ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు అమలుకు ఎక్కడ పొంతన లేదని ఆయన పేర్కొన్నారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమారమేష్‌యాదవ్, అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, నాయకులు కృష్ణగౌడ్, అజయ్‌కుమార్, నాగభూషణంచారి, ఆనంద్‌గౌడ్, యశ్వంత్, చుక్క జగన్, మూల రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

మహిళలపై వేధింపులను అరికట్టాలి



ఆందోళన చేపడుతున్న మహిళలు


ముషీరాబాద్: రాష్ట్రంలో ఇటీవల మహిళలపై అనేక లైంగిక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను, అత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, కె.నాగలక్ష్మిలు మాట్లాడుతూ.. హకీంపేట స్పోర్ట్స్‌స్కూల్‌లో జరిగిన లైంగిక వేధింపులపై సత్వర విచారణ జరపాలన్నారు. ఎల్‌బీనగర్‌లో గిరిజన మహిళలపై లాకప్ వేధింపులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. పెద్దపల్లిలో మైనర్‌బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విమల, లక్ష్మి, పుష్ప, లావణ్య, మణెమ్మ, అనంతమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తి ప్రదాత పాపన్నగౌడ్

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని పలువురు నేతలు కొనియాడారు. వివిధ పార్టీల నేతలు, గౌడ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



జ్యోతిరావుపూలే చౌరస్తాలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీజేపీ నేత గౌతంరావు



కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్



బీఆర్‌ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి



బాగ్‌అంబర్‌పేటలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ..